# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు 99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | శుక్రవారం,ఏప్రిల్11,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వెల: 1


## భారత్‌కు చేరుకున్న ముంబై ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా

- అమెరికా నుంచి అతనిని తీసుకొచ్చిన ప్రత్యేక విమానం
- ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం
- తీహార్ జైలుకు తరలించేందుకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సిద్ధం చేసిన అధికారులు



న్యూఢిల్లీ,ఏప్రిల్10,) 2008 ముంబై ఉగ్రవాద దాడి కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వుర్ హుస్సేన్ రాణా భారత్‌కు చేరుకున్నాడు. అతడిని అమెరికా నుండి తీసుకువచ్చిన ప్రత్యేక విమానం గురువారం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. అక్కడి నుండి అతడిని అధికారులు ప్రత్యేక భద్రత నడుమ తీహార్ జైలుకు తరలించనున్నారు. రాణాను తరలించేందుకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సిద్ధం చేశారు. తహవ్వుర్ రాణా రాక నేపథ్యంలో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. పాకిస్థాన్‌లో జన్మించిన తహవ్వుర్ హుస్సేన్ రాణా కెనడా పౌరసత్వం కలిగి ఉన్నాడు. తనను భారత్‌కు అప్పగించవద్దంటూ అతను పలుమార్లు అమెరికా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ నిరాశే ఎదురైంది. రాణా పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో, అతడిని తీసుకు వచ్చేందుకు భారత్ నుండి ప్రత్యేక బృందం అమెరికాకు వెళ్లింది. భారత బృందానికి రాణాను అప్పగించిన అనంతరం, అతను తమ కస్టడీలో లేడని అమెరికా ఫెడరల్ ప్రిజన్స్ బ్యూరో స్పష్టం చేసింది.

# పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ ముఖ్యమైంది

- రూ. 2కే బియ్యం అంటే ఎన్టీఆర్, రైతు బాంధవుడు అంటే వైఎస్సార్ గుర్తుకు వస్తారన్న సీఎం
- అలాగే యంగ్ ఇండియా తన బ్రాండ్ అన్న రేవంత్ రెడ్డి
- పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ ముఖ్యమైందన్న రేవంత్ రెడ్డి

పోలీసు శాఖపై నాకు స్పష్టమైన అవగాహన ఉంది



హైదరాబాద్,ఏప్రిల్10, ఐటీ కంపెనీలు, హైటెక్ సిటీని చూసినప్పుడు నారా చంద్రబాబునాయుడు గుర్తుకు వస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొట్టమొదటిసారి రూ. 2కే ఎన్టీఆర్ బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని, దానిని తీసుకున్న ప్రతి పేదవాడు ఆయనను గుర్తు చేసుకుంటారని అన్నారు. జలయజ్ఞం, రైతుబాంధవుడుగా వైఎస్సార్ ప్రజల మదిలో నిలిచిపోతారని అన్నారు. తన బ్రాండ్ యంగ్ ఇండియా అని ఆయన స్పష్టం చేశారు. విశ్లేషకులు, విమర్శకులు, ప్రజలకు తాను ఒక్కటే చెప్పదలుచుకున్నానని, యంగ్ ఇండియానే తన బ్రాండ్ అని ఆయన అన్నారు. ఎలాంటి బ్రాండ్ లేకుండా, గుర్తింపు లేని ముఖ్యమంత్రిగా ఉంటారా అని కొందరు తనను ప్రశ్నిస్తున్నారని, దానికి సమాధానంగా యంగ్ ఇండియా తన బ్రాండ్ అని చెబుతున్నానని అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఆయన యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ ఎంతో ముఖ్యమైనదని అన్నారు. పోలీసు శాఖపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. కేజీ టు పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని హామీ ఇచ్చారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూలుకు రూ. 100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిధుల విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

## హైదరాబాద్ సహా తెలంగాణలో చల్లబడిన వాతావరణం.. పలుచోట్ల వర్షం



- మియాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయం
- క్యుములోనింబస్ ప్రభావంతో వర్షాలు పడుతున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడి

హైదరాబాద్ నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది

హైదరాబాద్,ఏప్రిల్10,(ం) హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. అనేక ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. హైదరాబాద్ నగరంలో ఉదయం నుంచే వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం చిరుజల్లు కురిసింది. మియాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్, గాగిల్లాపూర్, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, జుబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, నల్గొండ, సూర్యాపేట, వరంగల్,

## గ్రామాల్లో పుట్టినవారికి ఇది సర్వసాధారణం..



- తాను శరద్ పూర్ణిమ రోజున పుట్టానన్న అమిత్ షా
- తనను చిన్నప్పుడు పూనమ్ అని పిలిచేవారని వెల్లడి
- కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీలో ప్రధాని ఎంపిక విభిన్నంగా ఉంటుంది

న్యూఢిల్లీ,ఏప్రిల్10,( మనలో చాలా మందికి చిన్నప్పుడు ముద్దుపేర్లు ఉండే ఉంటాయ్. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను కూడా చిన్నప్పుడు ముద్దుపేరుతో పిలిచేవారట. ఈ విషయాన్ని ఆయనే వెల్లడించారు. ఓ జాతీయ మీడియా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... చిన్నప్పుడు తనను 'పూనమ్' అని పిలిచే వారని చెప్పారు. ఐదేళ్లు నిండిన తర్వాత తనకు పేరు పెట్టాలనుకున్నారని... తాను శరద్ పూర్ణిమ రోజున పుట్టానని... అందుకే తనను పూనమ్ అని పిలిచేవారని వెల్లడించారు. గ్రామాల్లో పుట్టిన వారికి ఇది సర్వసాధారణ విషయమేనని చెప్పారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రధాని ఎంపిక విభిన్నంగా ఉంటుందని... బీజేపీలో అయితే మోదీ అత్యున్నత నాయకుడు కాబట్టి ప్రధాని అయ్యారని అన్నారు. ప్రస్తుత వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజంలోని కొందరికి మాత్రమే ఇష్టం లేదని చెప్పారు. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

## తెలంగాణకు భూకంప హెచ్చరిక...

- తెలంగాణకు భూకంప హెచ్చరిక భయాందోళనకు గురిచేస్తోంది. తెలంగాణకు భూకంపం వచ్చే అవకాశం ఉందని ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది.

హైదరాబాద్, ఏప్రిల్ 10: తెలంగాణకు భూకంప హెచ్చరిక భయాందోళనకు గురిచేస్తోంది. రామగుండంలో భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూకంప తీవ్రత గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. ఆ భూకంప తీవ్రత హైదరాబాద్, అలాగే అమరావతి వరకు కూడా ఉంటుందని అంటున్నారు. తెలంగాణకు భూకంపం వచ్చే అవకాశం ఉందని ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండం సమీపంలో భారీ భూకంపం సంభవించి అవకాశం ఉందని.. ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని అందులో పేర్కొంది.

## కంచ గచ్చిబౌలి భూముల్లో అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు ఉన్నాయి



కంచ గచ్చిబౌలిలోని భూముల్లో అరుదైన పక్షులు, జంతువులు, వృక్షాలు ఉన్నాయని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు పర్యావరణ, అటవీ శాఖలు కేంద్ర సాధికారిక కమిటీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ నేపథ్యంలో కమిటీతో హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సమావేశమైంది. ఈ భూముల వ్యవహారానికి సంబంధించిన డాక్యుమెంట్లు, విజువల్స్‌తో కూడిన నివేదికను బీఆర్ఎస్ బృందం కమిటీకి అందజేసింది. అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ, వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టివేయాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అటవీ శాఖ అనుమతులు ఇచ్చిన తర్వాతే చెట్లను తొలగించాల్సి ఉంటుందని తెలిపారు.

## కేంద్ర కమిటీకి తెలంగాణ ప్రభుత్వం నివేదిక..



కంచ గచ్చిబౌలి భూములపై కేంద్ర కమిటీకి తెలంగాణ ప్రభుత్వం నివేదిక సమర్పించింది. 400 ఎకరాల భూముల వ్యవహారానికి సంబంధించి పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీతో తెలంగాణ ప్రభుత్వ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు నివేదికను అందజేశారు. కంచ గచ్చిబౌలిలోని భూములను పరిశీలించేందుకు కేంద్ర సాధికారిక కమిటీ హైదరాబాద్‌కు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. ఈ కమిటీ కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయనుంది.

# రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలి

**- ఎంపీడీవో జే. వెంకటేశ్వరరావు**



పెన్ పహాడ్/ప్రజా ముచ్చట,ఏప్రిల్ 10:రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు లను ఎంపీడీవో కార్యాలయం లోని ప్రజా పాలన సేవా కేంద్రం యందు అందజేయాలని ఎంపీడీవో జే .వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం యందు వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ధి కోసం ఆన్లైన్ యందు దరఖాస్తు చేసుకున్న వారు ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజా పాలన సేవా కేంద్రం యందు ఈనెల 14 వ తేదీ లోపు సంబంధిత పత్రాలు జత చేసి అట్టి దరఖాస్తు ఫారంలను అందజేయాలనీ, తేదీ:10-04-2025 వరకు మండలంలో ఆన్ లైన్ యందు 1552 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం 823 మాత్రమే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు అందచేశారని ఇంకా 729 దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయంలో అట్టి దరఖాస్తులను అందజేయలేదని తెలిపారు. ఆన్ లైన్ చేసుకోవడంలో సర్వర్ సమస్యలు తలెత్తిన, ఆన్ లైన్ చేసుకోవడం తెలియకపోయినా, ఎంపీడీవో కార్యాలయం, పెన్ పహాడ్ లోని ప్రజాపాలన సేవ కేంద్రంలో ఆఫ్ లైన్ లో కూడా సంబంధిత పత్రాలు అందజేసి దరఖాస్తు చేసుకోవచ్చు, ఒకసారి ఆన్ లైన్ యందు దరఖాస్తు చేసుకున్న వారు మరల ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదనీ, ఆన్లైన్ యందు దరఖాస్తు చేసుకున్న వారు మాత్రం అట్టి ఆన్ లైన్ చేసిన దరఖాస్తు ఫారం మరియు సంబంధిత పత్రాలు జత చేసి తప్పకుండా ఎంపీడీవో కార్యాలయం, పెన్ పహాడ్ లోని ప్రజా పాలన సేవా కేంద్రం యందు అందజేయాలని కోరారు.

# కార్మిక బద్ధ వ్యతిరేకి కేంద్ర ప్రభుత్వం...

**- మేకల శ్రీనివాసరావు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి**




హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:హుజూర్నగర్ మండల మహాసభ మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో కార్మిక శక్తిని నిర్వీర్యం చేస్తున్న కార్మిక బద్ధ శత్రువు నరేంద్ర మోడీని ఇంటికి సాగనంపాల్సిన టైమ్స్ ఆసన్నమైందని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు కార్మిక విరోధి ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తున్న మతతత్వ పార్టీని సమాధి చేయాలని ఆయన పిలుపునిచ్చారుసంక్షేమ బోర్డు పరిరక్షణ ధ్యేయంగా పనిచేయాలని నిర్మాణ రంగంలో కార్మికులకు ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షల రూపాయలు ఇవ్వాలని సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై మరిన్ని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాల హక్కులను కాలరోస్తూ పని గంటల విధానం పెంచుతూ కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తుందని ఆయన అన్నారు రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరడానికి ఈ ప్రభుత్వం అనేక ఆంక్షల పెడుతూ కాలయాపన చేస్తూ కార్మికుల ఇబ్బందులు గురిచేస్తుందని ఒక కార్మికుడు తాను సంక్షేమ బోర్డులో చేరాలని గాని రెన్యువల్ చేసుకోవాలన్న గాని నెలలు తరబడి ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉందని ఇలాంటి పరిస్థితుల నుంచి బయట పడాలంటే పోరాటాల శరణ్యం అని ఆయన పిలుపునిచ్చారు భవన నిర్మాణ కార్మికులకు పెళ్లి కానుక 30వేల నుండి లక్ష రూపాయలకు పెంచాలని డెలివరీ కేసుని 50 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ మహాసభకు జెట్టి ప్రసాద్ అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ ప్రాంతీయ గౌరవాధ్యక్షులు ఇందిరాల వెంకటేశ్వర్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముడుసు పాపారావు కామన్ నవీన్ ఎం వెంకటేశ్వర్లు పాలడుగు రాజు శంబిరెడ్డి తదితరులు పాల్గొనగా మహాసభ అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులు ముడుసు పాపారావు ఉపాధ్యక్షులు... దగ్గుపాటి సత్యానందం భారతం చిన్న పిచ్చయ్య , ప్రధాన కార్యదర్శి ,కామల్ల ఆనందు ,బండి భాస్కర్,శ్యాంసన్, కోశాధికారి బొప్పన రాజు కమిటీ సభ్యులు దాసరి వీరస్వామి జక్కుల రమణ చింతిరాల శ్రీను చింతమల్ల ఎంకన్న చిన్న పొంగు పుల్లయ్య జానపాటి అచ్చయ్య తదితరులను ఎన్నుకున్నారు.

# ముత్తినేని అనసూర్యమ్మకు నివాళులర్పించిన పటేల్ రమేష్ రెడ్డి

ప్రజా ముచ్చట/పెన్ పహాడ్, ఏప్రిల్ 10: మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్తినేని శ్రీనివాస్ తల్లి ముత్తినేని అనసూర్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం గ్రామంలోని ఆమె స్వగృహానికి విచ్చేసిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



ముత్తినేని అనసూర్యమ్మ చిత్రపటంవద్ద నివాళులు అర్పిస్తున్న పటేల్ రమేష్ రెడ్డి

# పోషణ పక్షం పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్





యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 జిల్లాలో పోషణ పక్షంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ హనుమంత రావు రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డితో కలిసి పోషణ పక్షం పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పోషణ పక్షం ఏప్రిల్ 8వ తేదీ నుండి ఏప్రిల్ 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.కావున షెడ్యూలు ప్రకారం రోజు వారి కార్యక్రమాలు ప్రతి అంగన్వాడి కేంద్రంలో నిర్వహించాలని,కార్యక్రమాల ఫొటోస్ డాష్ బోర్డు లో అప్లోడ్ చేయాలని,యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి,జిలా సంక్షేమ అధికారి నరసింహా రావు,జిల్లా వైద్య శాఖ అధికారి మనోహర్,డిపిఓ సునంద బీసీ మరియు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య , డిపిఆర్ఓ అరుంధతి మరియు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులు మరియు పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

ప్రజా ముచ్చట/పెన్ పహాడ్, ఏప్రిల్ 10: మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మీసాల లింగయ్య కలమ్మ దంపతుల కుమార్తె వివాహం గురువారం నూతనకల్ మండలంనెమ్మికల్ లోని ఒక ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నూతన వధూవరులైన అఖిల – రాధాకృష్ణలను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం పిల్లాపాపలతో కలకాలం సుఖ సంతోషాలతో కొనసాగాలని జగదీష్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, బిఆర్ఎస్ మండల నాయకులు ధనియాకుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మీసాల లచ్చయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎగ్గడి మురళి, నెమ్మాది కృష్ణ, ఒగ్గు గోపి, మీసాల మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు...



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జగదీష్‌రెడ్డి, నాయకులు

# శాంతి భద్రతలకు భంగం కల్పిస్తే కఠిన చర్యలు






**- డీఎస్పీ కే.రాజశేఖర్ రాజు**
**-నార్కోటిక్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్**
**-నెంబర్ ప్లేట్ ఫోర్జరీ12 బైకులు,4 ఆటోలు స్వాధీనం**
**- డివిజన్ పరిధిలో డీజేలు నిషేధం**

,మిర్యాలగూడ ఏప్రిల్ 10:నల్లగొండ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకుడీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో 85 మంది సిబ్బందితో మిర్యాలగూడ పట్టణంలోనే గాంధీనగర్ లో గురువారం ఉదయం 5:30 నుండి 7:00 వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నమ్మదగిన సమాచారం మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహణలో 12 నెంబర్ ప్లేట్ ఫోర్సరి బైకులు,44 సరైన పత్రాలు లేని బైకులు,నాలుగు ఆటోలు స్వాధీనం.నెంబర్ ప్లేట్ ఫోర్జరీ సంబంధించి త్వరలో ఎంక్వయిరీ చేసి కేసు నమోదు చేస్తామని అన్నారు. మిర్యాలగూడ పట్టణ ప్రజలు అనుమానితులకు ఇండ్లు రెంటుకు ఇవ్వవద్దు,పండుగల సమయంలో ప్రోగ్రామ్స్ నిర్వహించేటప్పుడు పోలీసుల అనుమతి తీసుకోవాలి.అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.మిర్యాలగూడ డివిజన్ పరిధిలో గార్డెన్ సెర్చ్ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. డివిజన్ పరిధిలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని అన్నారు.డీఎస్పీ వెంట రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్, సీఐ సామనర్సయ్య టూటౌన్ ఎస్ఐ.రాంబాబు,రూరల్ ఎస్సై లక్ష్మయ్య,వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు,మాడుగులపల్లి ఎస్సై కృష్ణయ్య,భిక్యం, శేఖర్,ప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్,మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# బొత్తలపాలెం గ్రామంలో ముందుస్తు బడిబాట కార్యక్రమం



పాలకవీడుప్రజముచ్చట న్యూస్:ప్రభుత్వ బడులలోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాధికారి కాటయ్య పేర్కొన్నారు.మండలంలోని పీఎం ఎంపీపీ ఎస్ బొత్తలపాలెం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మండల విద్యాధికారి కాటయ్య ఇంజమూరి పర్యవేక్షణలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్తల పాలెం గ్రామ పెద్దలను, తల్లిదండ్రులను కలిసి పీఎం , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోధన అభ్యసన కార్యక్రమాల పై గ్రామస్తులకు విస్తృతంగా వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులను కోరడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలను కలిసి ప్రాథమిక పాఠశాలలో పీఎం శ్రీ కార్యక్రమం కింద ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసి సౌకర్యాలను మెరుగుపరచడం జరిగిన విషయాన్ని తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు దృష్టికి తీసుకువెళ్ళడం జరిగింది. ప్రాథమిక పాఠశాల బోత్తలపాలెం నందు ప్రీ ప్రైమరీ తరగతులను గతంలో ప్రారంభించిన విషయాన్ని గ్రామస్తులకు తెలియపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బత్తల పాలెం ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, పీఎం ఎంపీపీ ఎస్ బొత్తలపాలెం ప్రధానోపాధ్యాయులు ప్రగడ శేఖర్, ఉపాధ్యాయులు తులసి,మాధవి పాల్గొన్నారు. ఈ ముందస్తు బడిబాట కార్యక్రమం పాలకవీడు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు తప్పకుండా మరి ఒకసారి ప్రారంభించబడుతుందని మండల విద్యాధికారి పేర్కొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలు

**- జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ (ఐపీఎస్)**



,నల్లగొండ ఏప్రిల్ 10:జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్పి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు.ఈ నిషేధ ఉత్తర్వులను చట్టాన్ని ఉల్లంఘించి, ఎవరైనా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# "సన్నబియ్యం" తో లబ్దిదారుని ఇంట్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య భోజనం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 10యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నిరుపేద లబ్ధిదారుల కుటుంబం తో కలసి సహపంక్తి భోజనం చేసారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం చాలా బాగున్నాయని మహిళలు,ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామికి ఘనంగా తిరుప్పావడ సేవ

**- శోభాయిమానంగా స్వర్ణగీరీశున్ని నిత్య కళ్యాణ**
**- స్వర్ణగిరిలో 3600 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరణ**
**- మాడ వీధుల్లో సుభాయ మానంగా శ్రీనివాసుడి తిరి వీధి ఉత్సవ సేవ**



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 10కలియుగ ప్రత్యక్ష దైవమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో నేటి ఉదయం సుప్రభాత సేవతో మొదలుకొని రాత్రి ఏకాంత సేవ వరకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణాచార్యులు తెలిపారు.గురువారం సందర్భంగా సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామి వారికి జరిపే అన్న కూటోత్సవాన్నే తిరుప్పావడ సేవ అంటారు.ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ సేవ జరుగుతుంది. స్వర్ణగిరీశునికి సుమారు 450 కిలోల అన్న ప్రసాదం అనగా లడ్డు , వడ , తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు.ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో స్వామివారికి అర్చించి కర్పూర మంగళహారతులను సమర్పిస్తారు. ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్న ఖచిత స్వర్ణాభరణాలతో,పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు దివ్యకరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు.అనంతరం భక్తులు శ్రీవారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 2800 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 లకు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తులు తిరువీధి



ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.అనంతరం స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి



కర్పూర మంగళహారతులను సమర్పించగా శ్రీవారిని భక్తులు నయనానందకరంగా దర్శించుకున్నారు. ఈరోజు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యసాధనకు కృషి చేయాలి..



**- బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ-విద్యార్థినిలతో ముఖాముఖి**
**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ ఏప్రిల్ 10:విద్యార్థినిలు ఉన్నత లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు.గురువారం ఆమె నల్గొండ జిల్లా, పెద్దవూర లోని గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. భోజనం ఎలా ఉందని? ఎలా చదువుకుంటున్నారని? ప్రశ్నించారు. బాగా చదువుకోవాలని చెప్పారు.ఐఐటి అంటే ఏమిటి? క్రిటికల్ కేర్ యూనిట్? జాకెట్? తదితర పదాలకు స్పెల్లింగ్ లను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక కాకతీయ సామ్రాజ్యం, ఇతర సామ్రాజ్యాలు, మహాలక్ష్మి దేవత, గురించి అడిగి వారి తెలివితేటలను పరిశీలించారు. ఐఐటీ సాధించేందుకు లెక్కల్లో పర్ఫెక్ట్ గా ఉండాలన్నారు. ఐఐటి చదివే



విద్యార్థులకు నల్గొండలో ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తానని, ఎంత మందికి కోచింగ్ కావాలో పేర్లు ఇవ్వాలని అడిగారు. ఎంతమంది డాక్టర్ కావాలనుకుంటున్నారని ?డాక్టర్ కావాలంటే ఏం చదవాలని? అడిగారు. నల్గొండ లో అండర్ గ్రాడ్యుయేషన్ నీట్ కు ఐదు సంస్థలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలని ,అంతేకాక ఇటీవలే నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రారంభించడం జరిగిందని, 40000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా రహదారి ప్రమాదాలు ,ఇతర సమయాలలో అత్యవసర సమయాల్లో వైద్యం అవసరమైన వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఇవన్నీ ప్రిపేర్ అయ్యేవారికి బాగా పనికొస్తుందని చెప్పారు . విద్యార్థినిలు బాగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని, కలెక్టర్ స్థాయిని మించి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధన కృషి చేయాలని పిలుపునిచ్చారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి రాజ్ కుమార్, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ ,ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

# పైలాన్ కాలనీలో నూతన బస్తీ దవఖాన ప్రారంభం



**- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,శాసనసభ్యులు జైవీర్ రెడ్డి**

నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగాను త్వరలోనే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని నాగార్జునసాగర్ నియోజకవర్గానికి తీసుకురానున్నట్లు నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి తెలిపారు.గురువారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవఖానను ప్రారంభించారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ పైలాన్ కాలనిలో ఉన్న కమలానెహ్రూ ఆసుపత్రికి అనుసంధానంగా పైలాన్ కాలని బస్తీ దవఖాన పనిచేస్తుందని, ఈ దవఖాన పైలాన్ కాలనీ ప్రజలకు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. పైలాన్ కాలనీ మాదిరిగానే హాలియాలో సైతం బస్తీ దాఖానను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడటం జరిగిందని, త్వరలోనే అక్కడ బస్తి దవాఖాన ఏర్పాటు చేస్తామని, అంతేకాక నియోజకవర్గం లోని నాగార్జునసాగర్ ఏరియా ఆసుపత్రి, ఇతర ఆసుపత్రుల ద్వారా వైద్య సౌకర్యాలను మెరుగుపరిచి నాగార్జునసాగర్ ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు



త్వరలోనే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నియోజకవర్గానికి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ ఆయా సబ్ సెంటర్ల పరిధిలో ఉన్న గృహస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంలు ,ఆశ కార్యకర్తలు ఇల్లిళ్ళు తిరిగి వ్యాక్సినేషన్, ఇతర వైద్య సదుపాయాలను కల్పించే వారని, వారికి ఉన్న పనిభారాన్ని తగ్గించేందుకుగాను జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్ర ప్రభుత్వం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో బస్తీ దవాఖాన సౌకర్యం మంజూరు చేసిందని, ఈ బస్తీ దవాఖాన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఒక డాక్టర్, స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్ లతో పనిచేస్తుందని, ఈ బస్తీ దవఖానలో టెస్టింగ్ ల్యాబ్ తో పాటు, సిబిపి ప్యాతలాజికల్, బయోలాజికల్ పరీక్షల ల్యాబ్ ఉంటాయని ,ఇక్కడ నిర్వహించే పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను రోగుల మొబైల్ కు నేరుగా మెసేజ్ ద్వారా పంపించే ఏర్పాటు ఉంటుందని తెలిపారు. ఈ బస్తీ దవాఖాన నాగార్జునసాగర్ ఆసుపత్రికి అనుసంధానంగా ఉంటుందన్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ ,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితో కులవివక్షను తరిమికొడదాం

కుల వివక్ష ఇప్పుడు ఎక్కడ ఉంది? ఇప్పుడంతా మారిపోయింది. అందరూ కలిసి తింటున్నారు, కలిసి తిరుగుతున్నారు, హోటళ్లలో, జాతరల్లో, ఉత్సవాల్లో అన్నింట్లో కలిసే ఉంటున్నారు. ఇంకా వివక్ష ఎక్కడుంది? ఈ మధ్య కాలంలో ఇలాంటి వాదనలు, మాటలు తరచూ మనువాదుల నుండి వినిపిస్తున్నాయి. మోడీ పాలనలో దేశం చాలా మారిందంటున్నారు. వివక్ష లేనే లేదంటున్నారు. కానీ%ౌ%నేటికీ నిచ్చెన మెట్ల కులజాఢ్యం అణగారిన ప్రజల్ని పట్టి పీడిస్తూనే ఉంది. మాల, మాదిగ పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కనిపిస్తూనే ఉంది. అయితే గతంలో ఉన్నంత మొరటుగా ఇప్పుడు లేకపోవచ్చు కానీ, తీవ్రమైన కులవివక్ష రూపం మార్చుకుని మరో రూపంలో కొనసాగుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగం ఇంత అభివృద్ధి చెంది మంచి ఫలితాలు సాధిస్తుంటే ఇదేం కులవివక్ష అనుకోవచ్చు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత కొనసాగడానికి అగ్రవర్ణాల ఆధిపత్యంతో నడిచే పాలక వర్గ ప్రభుత్వాలే కారణం అని చెప్పవచ్చు.మన రాష్ట్రంలోనూ దళితులపై దుర్మార్గమైన దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని జాతీయ నేర విభాగం నివేదికలు తెలుపుతున్నాయి.వివిధ సందర్భాల్లో కుల వివక్ష బయట పడుతుంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామాల్లో నేటికీ రచ్చ బండల మీద కూర్చోనీయకపోవడం, రాయలసీమ ప్రాంతంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలపై వివక్ష పాటించడం, ఎక్కువ ప్రాంతాల్లో గుడిలోకి రానీయకపోవడం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి వంటి అనేక పలు ఇతర రూపాల్లో కులవివక్ష కొనసాగుతున్నది. చదువుకున్న ఉద్యోగులపైనా కులవివక్ష ప్రభావం కనిపిస్తున్నది.నగరాల్లో శాకాహారులకు మాత్రమే ఇళ్లు అద్దెకిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు అద్దెకు ఇవ్వరు. పైగా 'శాకాహారులకు మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అని తమ ఇంటి గోడలు, గేట్ లకు బోర్డులు పెడుతున్నారు.నేటికీ జస్టిస్ పున్నయ్య సిఫారసులు అమలు కావడంలేదు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్) ఉమ్మడి రాష్ట్రంలో వేలాది మంది కార్యకర్తలతో సుమారు మూడు వేల గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలుపై సర్వే చేసింది. వచ్చిన అనేక సామాజిక సమస్యలు, అంటరానితనం, కులవివక్ష, రెండు గ్లాసుల పద్ధతిపై అనేక పోరాటాలను గ్రామాల్లో ప్రత్యక్షంగా నిర్వహించింది. దీనికి తోడు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యేలు పట్టుబట్టడం వల్ల నాటి చంద్రబాబు ప్రభుత్వం దిగొచ్చి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పున్నయ్యతో ఎస్సీ, ఎస్టీ ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇది కె.వి.పి.ఎస్ సాధించిన మొదటి విజయం.జస్టిస్ పున్నయ్య కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 164 రకాల కులవివక్ష రూపాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పరిష్కారం కోసం సూచనలు చేసింది. కమిషన్ ఏర్పాటు చేసిన పాలకులు ఆ సూచనలను చిత్తశుద్ధితో అమలు చేయాలి కదా! నేటికీ పున్నయ్య సిఫారసు చేసిన నలభై అంశాల్ని సర్కార్ పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇప్పటికీ కులవివక్ష రూపాలు కొనసాగుతున్నాయి.వారంలో ఒకరోజు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కుల వివక్షను గుర్తించి దాన్ని రూపుమాపడానికి ప్రయత్నించాలని పున్నయ్య కమిషన్ పధానంగా సిఫారసు చేసింది. కానీ ఎక్కడా ఆ సిఫారసు అమలుకు నోచుకోవటం లేదు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెలా చివరి రోజు కులవివక్ష, అంటరానితనంపై చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నది. కానీ దాన్ని కూడా ఎక్కడా అమలు జరపటం లేదు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగిన సందర్భంలో ఏకైక రక్షణ కవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిగా నీరుగార్చుతున్నది. 41 సి.ఆర్.పి.సి కింద స్టేషన్ బెయిలిస్తూ దాడులు మరింతగా పెంచడానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తున్నది.

### మనువాదంతో పెరుగుతున్న కులవివక్ష...

ఆరెస్సెస్-బిజెపి మనువాద మతోన్మాద విధానాలు పల్లె వాతావరణాన్ని చెదరగొడుతున్నాయి. కులవివక్ష, అంటరానితనాన్ని మరింతగా పెంచి పోషిస్తున్నాయి. చిన్నజీయర్‌స్వామి లాంటి ఆధ్యాత్మికవేత్త 'కులం ఉండాల్సిందే, కులం పోకూడదు. ఒక మనిషి శరీరానికి కాళ్లు చేతులు ఎంత అవసరమో, దేశానికి కులాలు అంత అవసరం' అని ప్రబోధిస్తున్నారు. గ్రామ సీమల్లో దళితులు అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పడానికి ప్రయత్నిస్తే పోటీగా ఆరెస్సెస్ ఇతరులను రెచ్చగొట్టి, ఇతర నాయకుల విగ్రహాలను పెట్టి ప్రజల మధ్య ఘర్షణలను సృష్టించి కులాల కుంపటిని రగలించి రాజకీయాలు నడుపుతున్నది. 'కుల వివక్షత, అంటరానితనం, నేరం. చట్ట విరుద్ధం' అని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 పేర్కొంటున్నాయి. కానీ ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై రాజ్యాంగంపై ప్రమాణం చేసినవారు కుల వివక్ష రూపుమాపడానికి ఎటువంటి ప్రయత్నం చేయకపోగా పరోక్షంగా దాన్ని బలపరుస్తున్నారు.మహనీయులైన పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతుల సందర్భంగా దండలేసి దండాలు పెట్టి వారి ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు కొందరు. కానీ పూలే, అంబేద్కర్‌లు తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలను నిర్మించారు. వారి అడుగుజాడల్లో పయనిస్తున్న కె.వి.పి.ఎస్%ౌ%మన సమాజంలో నేటికీ కొనసాగుతున్న కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 11 నుండి 14వ తేదీ వరకు మహనీయులు పూలే, అంబేద్కర్‌ల స్ఫూర్తితో%ౌ%క్షేత్ర స్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు చేయాలని నిర్ణయించింది. ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది.సమాజ హితం కోరుకునే వ్యక్తులు, శక్తులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ ఈ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కె.వి.పి.ఎస్ పిలుపునిస్తోంది. చాప కింద నీరులా సాగుతున్న మనువాద సంస్కృతి, కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా రూపుమాపబడాలంటే ప్రజలు ఐక్యంగా పూనుకోవాలి. కులవివక్షను ప్రతిఘటించి పారదోలాలి.